క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సాక్షి, మచిలీపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మచిలీపట్నం మున్సిపల్ క్లస్టర్–1లో మహిళా విభాగం అధ్యక్షురాలిగా ప్రీత పద్మావతి, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ రబ్బానీ, బీసీ విభాగం అధ్యక్షుడిగా పులిచెర్ల రాజేష్, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా కె. దినేష్ విజయ్ సాగర్, మున్సిపల్ క్లస్టర్–2లో మహిళా విభాగం అధ్యక్షురాలిగా మునగాల భాగ్యలక్ష్మి, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఆదమ్ ఖాన్, బీసీ విభాగం అధ్యక్షుడిగా బోర్ర సుధాకర్, ఎస్సీ విభాగం అధ్యక్షురాలిగా ముత్యాల లక్ష్మి, మున్సిపల్ క్లస్టర్–3లో మహిళా విభాగం అధ్యక్షురాలిగా పడిమాముల వీరలక్ష్మి, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా మొహమ్మద్ ఆజామ్, బీసీ విభాగం అధ్యక్షుడిగా బొడ్డు వెంకటేశ్వరరావు, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా వి. నాగేంద్రరావు, మచిలీపట్నం రూరల్ క్లస్టర్–1లో మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎం. లక్ష్మీకుమారి, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ మస్తాన్, బీసీ విభాగం అధ్యక్షుడిగా రాజేష్ బడుగు, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా గంతల సంతరావు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా ఉప్పులేటి సురేష్‌బాబు, మచిలీపట్నం రూరల్ క్లస్టర్–2లో మహిళా విభాగం అధ్యక్షురాలుగా వీరలక్ష్మి, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా ఎండీ బాషా, బీసీ విభాగం అధ్యక్షుడిగా నట్టే ప్రసాద్, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా మంద బాబు రావు, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఇందుపల్లి నాగేశ్వరరావును నియమించారు.

కనులపండువగా నరసింహుని కల్యాణం



గూడూరు: స్థానిక శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తట్టా రామానుజాచార్యులు, పద్మ, గౌరిపర్తి నాగరాజు, ఝాన్సీలక్ష్మి, ఆకునూరి సాయికుమార్, చిన్మయి, ఆర్వీ శివరావ్, వినీత దంపతులు పెళ్లిపీటలపై కూర్చొని స్వామి వారికి కల్యాణం చేయించారు. ఈ సందర్భంగా సోమవారం అన్నదానం జరిగింది. వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము), జెడ్పీ చైర్‌పర్సన్ హారిక దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా సామూహిక సత్యవ్రతం

మెరకనపల్లి(మోపిదేవి): మెరకనపల్లి గ్రామం రామాలయం వద్ద సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉదయం వ్రతం నిర్వహించారు. జిల్లా కో ఆర్డినేటర్ సీవీకే ప్రసాద్ టీటీడీ అందిస్తున్న ఈ వ్రతం ఉద్దేశం, గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. టీటీడీ ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు, లింగం బసవశంకరరావు, అవనిగడ్డ మండల ధర్మాచార్యులు అనబటి కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సింహాద్రి చరణ్ ప్రత్యేక పూజలు



కోడూరు: వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ తనయుడు రామ్‌చరణ్ సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరలో పాల్గొన్నారు. పండితులు రామ్‌చరణ్‌ను పూలమాల, శేషవస్త్రంతో సన్మానించారు. కోడూరు అయ్యప్పస్వామి దేవాలయంలో రామ్‌చరణ్ పూజలు నిర్వహించారు. పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సర్పంచి కొప్పనాతి శేషుబాబు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద ఒప్పందాలతో రైతులకు ద్రోహం

చల్లపల్లి: సామ్రాజ్యవాదులతో, ప్రపంచ వాణిజ్య సంస్థతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో రైతులకు ద్రోహం జరుగుతోందని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఏటీఎంల సెంటర్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగింది. ఝాన్సీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు భూమిని, వ్యవసాయ రంగాన్ని స్వదేశీ దోపిడీ వర్గాలకు, కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలు చేయడానికి అత్యంత దూకుడుగా ముందుకు సాగిందన్నారు. సభలో జన సాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్, రైతు కూలీ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి యు.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తజన జాతర

- నాంచారమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులు
- పెదప్రోలు, కోడూరులో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే రమేష్‌బాబు దంపతులు



విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మవారిని దర్శించుకుంటున్న భక్తజనం



ప్రత్యేక అలంకారంలో నాంచారమ్మ

కోడూరు: కృష్ణాతీరంలోని విశ్వనాథపల్లి గ్రామం భక్తజన జాతరతో పోటెత్తింది. అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన జాతర పురస్కరించుకొని సోమవారం తెలుగు రాష్ట్రాల్లోని సుమారు లక్ష మంది పైగా భక్తజనం అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఉదయం 6గంటల నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి పుట్టింటి వారైన గుంటూరు, ప్రకాశం జిల్లాల భక్తులు నాంచారమ్మ దర్శనానికి బారులు తీరారు. హైదరాబాద్, ఉభయగోదావరి, విశాఖపట్నం, వరంగల్, విజయవాడకు చెందిన భక్తులు కూడా ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కృష్ణానది వద్ద ఏర్పాటు చేసిన రెండు ఘాట్లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

సంతానం కోసం ప్రాణాచారం..

నాంచారమ్మ తల్లికి ఒడుగంటి బియ్యం సమర్పించి ఆలయం వెనుక భాగంలో కదలకుండా అమ్మ నామస్మరణతో ప్రాణాచారం చేస్తే సంతానభాగ్యం కలుగుతుందని మహిళల ప్రగాఢ విశ్వాసం. దీంతో మహిళలు ఈ ప్రాణాచారం చేసి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కొంతమంది భక్తులు తమ పిల్లలను ఆలయం ఎదుట ధ్వజస్తంభానికి కట్టగా, మేనమామ వరుసవారు వేలం ద్వారా విడిపించుకున్నారు. యువకులు డప్పువాయిద్యాల నడుమ కోళ్లు, మేకపోతలను ఊరేగించి సమీప పొలాల్లో కుటుంబసమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు.

త్రిశూలధారిణిగా

జాతర నేపథ్యంలో నాంచారమ్మ మూలమూర్తిని త్రిశూలధారిణిగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలు, భక్తుల సమర్పించిన చీరలు, గాజులు, పూలదండలతో ముస్తాబు చేశారు. తల్లి దివ్యస్వరూపాన్ని తిలకించి భక్తులు పరవశించారు. మూలమూర్తిని భక్తులు స్వయంగా తాకే అవకాశభాగ్యం ఉండటంతో పలువురు భక్తులు బంగారు మంగళసూత్రాలు, ఆభరణాలను సమర్పించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు దంపతులు

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే సింహాద్రి దంపతులు

నాంచారమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కెప్టెన్ లక్ష్మి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పటువస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాన్ని పండితులు రమేష్‌బాబు దంపతులకు అందించారు. డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో 250మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈఓ సీహెచ్ సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆరు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: నాంచారమ్మకు జాతరకు వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. జాతరలో పాల్గొన్న ఆరు వేల మందికి అన్నసమారాధన చేశారు. దీన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దంపతులు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు తనయుడు సింహాద్రి రామ్‌చరణ్, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పెదప్రోలులో ..

పెదప్రోలు(మోపిదేవి): భక్తుల పాలిట కల్పతరువు శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర ఉత్సవాలు పెదప్రోలులో సోమవారం వైభవంగా నిర్వహించారు. అవనిగడ్డ సింహాద్రి రమేష్‌బాబు దంపతులు దర్శించుకుని ప్రజలను చల్లగా కాపాడాలని అమ్మవారిని కోరుకున్నారు. అనంతరం చుట్టు ప్రక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రైతులు తమ పశువులు, మేకలు, గొర్రెలను ఆలయం చుట్టూ తిప్పారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. స్థానిక రజకసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీని చల్లపల్లి సీఐ నాగప్రసాద్ ప్రారంభించారు. భక్తుల రద్దీ దృష్ట్యా వాహనాలను నేషనల్ హైవేపైకి మళ్లించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు, అధ్యక్షులు ఆకుల వెంకట్రామయ్య, చైర్మన్ కుర్రా గురుప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో చల్లపల్లి సీఐ నాగప్రసాద్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



పెదప్రోలులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ నాగప్రసాద్

- అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు తనయుడు రామ్‌చరణ్ దర్శించుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో ముసలం

- కూటమి తరఫున మాజీ ఉపసభాపతి బుద్ధప్రసాద్‌కు సీటివ్వాలని డిమాండ్
- ఆయనకు మద్దతుగా ఇద్దరు టీడీపీ నేతలు రాజీనామా
- టీడీపీ గుర్తించడం లేదని బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్ ఆవేదన
- టీడీపీ నేతల తీరుపై జనసేన ఆగ్రహం
- పోటీ చేయనని చెప్పానంటూనే బుద్ధప్రసాద్ తెరవెనుక రాజకీయం చేస్తున్నారని ఆరోపణ

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కూటమిలో ముసలం మొదలైంది. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు సీటివ్వక పోవడాన్ని నిరసిస్తూ ఇద్దరు టీడీపీ నేతలు పదవులకు రాజీనామా చేశారు. పోటీకి విముఖమంటూనే మిత్ర ధర్మాన్ని మంట కలుపుతున్నారని జనసేన నేతలు తీవ్రంగా విరుచుకు పడ్డారు. బుద్ధప్రసాద్‌కు మద్దతుగా సోమవారం టీడీపీ నేతలు సమావేశం నిర్వహించడంపై జనసేన నేతలు మండిపడుతున్నారు. తాజా పరిణామాలతో కూటమిలో ముసలం పుట్టింది.

పోటీకి దూరమంటూనే తెరవెనుక రాజకీయం

డబ్బే ప్రధానాంశంగా రాజకీయాలు నడుస్తున్న తరుణంలో తాను పోటీ చేయనని ఏడాది క్రితమే టీడీపీ అధినేత చంద్రబాబుతో చెప్పినట్టు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ బహిరంగంగానే చెప్పారు. తనకు గుర్తింపు ఇవ్వడం లేదని, డబ్బునే ప్రామాణికంగా తీసుకుంటున్నారని టీడీపీ అధినేత చంద్రబాబుపై ఒకింత అసహనం కూడా ఆయన వ్యక్తం చేశారు. పొత్తులో భాగంగా కాపు సామాజిక వర్గం అధికంగా ఉండే అవనిగడ్డ సీటును తొలినుంచి జనసేన కోరుతోంది. ప్రస్తుతం జనసేన అభ్యర్థిని ప్రకటించేందుకు ఆ పార్టీ తలమునకలైంది. గతనెలలో మోపిదేవిలో టీడీపీ నేతలు సమావేశమై కూటమి అభ్యర్థిగా బుద్ధప్రసాద్‌కు అవనిగడ్డ సీటివ్వాలని, లేకపోతే ఇండిపెండెంట్‌గానైనా గెలిపించుకుంటామని ప్రకటించారు. సోమవారం టీడీపీ నేతలు ప్రత్యేక సమావేశం నిర్వహించి బుద్ధప్రసాద్‌కు కూటమి తరుపున సీటివ్వాలని డిమాండ్ చేశారు. దీనిలో బుద్ధప్రసాద్ తనయుడు, టీడీపీ జిల్లా నేత మండలి వెంకట్రామ్(రాజా) మాట్లాడుతూ టీడీపీ అధిష్టానం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అవనిగడ్డ సీటుపై నెలరోజుల నుంచి టీడీపీ నాన్చుడు ధోరణి అవలంబించడం, తమకు గుర్తింపు ఇవ్వకపోవడంతో అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జనసేనకు కేటాయించిన సీట్లను టీడీపీ తీసుకుంటోందని, ఆపార్టీకి కేటాయించిన సీట్లను జనసేన తీసుకుంటోందని ఈ నేపథ్యంలో బుద్ధప్రసాద్‌కు అవనిగడ్డ సీటివ్వాలని టీడీపీ నేతలు కోరుతున్నట్టు వెంకట్రామ్ చెప్పారు.



టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా నాయకుడు మండలి వెంకట్రామ్

టీడీపీ నేతల రాజీనామా

మండలి బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ టీడీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బావిరెడ్డి వెంకటేశ్వరరావు, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రావి చిట్టిబాబు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ పరిణామాలు కూటమిలో మరింత కాక రాజేసింది. పొత్తు ధర్మాన్ని పాటించకుండా తెరవెనుక రాజకీయం చేస్తున్నారని జనసేన జిల్లా నాయకుడు చెన్నగిరి సత్యనారాయణ, అవనిగడ్డ టౌన్ అధ్యక్షుడు రాజనాల వీరబాబు విమర్శించారు. కృష్ణాజిల్లాలో కేటాయించిన ఏకైక సీటుని రాకుండా చేయడానికి కుట్రలు చేస్తున్నట్టు జనసేన నేతలు ఆరోపించారు. తాజా పరిణామాలు 'అవనిగడ్డ'లో టీడీపీ, జనసేన మధ్య అగ్గిరాజేసినట్టయింది.

మాజేరు అభివృద్ధికి మరింత కృషి


మాజేరు(చల్లపల్లి): మాజేరు అభివృద్ధికి మరింత కృషి చేస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తనయుడు సింహాద్రి వికాస్‌బాబు అన్నారు. కొత్త మాజేరులోని రామాలయం వద్ద సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సింహాద్రి వికాస్ బాబు గ్రామస్థులతో సమావేశమయ్యారు. కొత్తమాజేరులో తాగునీటి కాలుష్యంతో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్న సమయంలో సింహాద్రి రమేష్‌బాబు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఈ గ్రామానికి ఆహ్వానించి మృతుల కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు నివేశన స్థలాలు, గృహాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జగనన్న విలేజ్ క్లినిక్, అధునాతన సౌకర్యాలతో పీఏసీఎస్ భవనం అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యేగా మరోసారి మీ ముందుకు వస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరూ ఈ ప్రాంత వాసులే కావడంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని), అవనిగడ్డ జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏఎంసీ చైర్మన్ కేవీవీ వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్, నేతలు క్లోపల్లి లక్ష్మీనారాయణ, తమ్ము మనోజ్, తిరుమలశెట్టి బాలు, బెల్లపు హరిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తమాజేరులో గ్రామస్థులతో మాట్లాడుతున్న సింహాద్రి వికాస్‌బాబు

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారి తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, అఖండస్థాపన, మండపారాధన, దీక్షధారణను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత అయ్యప్ప మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు జరిగాయి. అయ్యప్ప మూలవిరాట్‌కు 108 లీటర్ల స్వచ్ఛమైన ఆవు పాలతో అభిషేకం చేశారు. ముందు అభిషేక సామగ్రిని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు – కెప్టెన్ లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కోడూరులో అయ్యప్ప మూలవిరాట్‌కు క్షీరాభిషేకం

పెడన: స్థానిక శ్రీవాసవి క్షేత్రంలోని అయ్యప్ప ఉపాలయంలో స్వామి వారికి 18 రకాల ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి క్షేత్రం ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు సోమవారం స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామికి అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) స్వామి వార్లకు నూతన వస్త్రాలు బహూకరించారు. సంఘ నాయకులు జల్లూరి రాంబాబు, జవ్వాజి నాగు, బాల, భాస్కర్, సాయి పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్పదేవాలయంలో సోమవారం స్వామివారి పుట్టినరోజు వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుహాసినీలు లక్ష్మీజయంతి సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఉప్పాల రాము, హారిక

బంటుమిల్లి: ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. మండలంలోని నాగన్నచెరువు గ్రామంలో సోమవారం ఆమె పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రాముతో కలసి ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. హారిక, రాము గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంచారు. సంక్షేమ ఫలాలు నిరంతరం కొనసాగాలంటే ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఉప్పాల రామును ఎమ్మెల్యేగా గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మెరుగైన సంక్షేమ ఫలాలు పేదల ఇంటికి చేరుతాయని దానికి ప్రజలంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాస్, ఎంపీటీసీ కొక్కిలిగడ్డ కనకదుర్గ, గ్రామ కన్వీనర్ అచ్చిరెడ్డి, పట్టపు బుజ్జి, అబ్రహాం, ఎం. రాజబాబు, శ్రీనివాస్ మండలంలోని పలు గ్రామాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు వారిద్దరూ ముంజులూరు గ్రామంలో నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నాగన్న చెరువు గ్రామం ప్రజాదీవెనలో ఉప్పాల రాము

30న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

పెడన: కాకర్లమూడిపాలెంలో ఈ నెల 30 శ్రీహనుమత్ రామాలయంలో శ్రీసీతాలక్ష్మణ కోదండ రామ పరివార విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 8.01గంటలకు ప్రతిష్ఠా కార్యక్రమం ఉంటుందని, 11 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

ఆనందోత్సాహాలతో హోలీ



మచిలీపట్నంటౌన్: హోలీ పండుగను నగరవాసులు సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో స్నేహితులు, బంధువులతో కలిసి రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. వాటర్‌గన్‌లతో ఒకరిపై ఒకరు రంగునీళ్లను చల్లుకుంటూ సందడి చేశారు. స్థానిక 38వ డివిజన్‌లో వాసవీ క్లబ్, వనిత, కపుల్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వేముల కృష్ణ ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా, వాసవీక్లబ్ ప్రతినిధులు యెండూరి సురేష్, వీఎన్వీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

కృత్తివెన్ను: సంగమూడి గ్రామంలో నిర్మించిన ఆలయంలో ఈ నెల 27వ తేదీన శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం జరగనుంది. దీన్ని పురస్కరించుకుని సోమవారం విఘ్నేశ్వరస్వామి పూజ, గోపూజ, జలాధివాసం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 27న ఆలయం వద్ద అఖండ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పెడనలో రెండు రోజులకు ఒకసారి తాగునీరు

మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య

పెడన: తాగునీటి లభ్యతను పురస్కరించుకుని ఇక నుంచి పురప్రజలకు రెండు రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తామని పెడన మున్సిపల్ కమిషనర్ బి. వెంకటరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నామని, తరకటూరు సమ్మర్ స్టోరేజ్‌లో నీటి నిల్వల నేపథ్యంలో తాగునీటిని ఇక నుంచి రెండు రోజులకు ఒకసారి ఇస్తామని వివరించారు.

దేవాలయాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు



పుచ్చగడ్డ(చల్లపల్లి): దేవాలయాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. సోమవారం లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డలో నిర్మించనున్న శ్రీకృష్ణ స్వామి బృందావన దేవస్థాన శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, ఆలయ నిర్మాణ కమిటీ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన గానామృతం

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నిత్య ఔపోసన, బలిహరణ, విశేష అర్చనలు, హోమం నిర్వహించారు. అవభృదోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, కుంభ దేవారోపణం చేశారు. సాయంత్రం ఓలేటి గీతాపరమేశ్వరరావు బృందం నిర్వహించిన శ్రీనివాస కల్యాణ గానామృతం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ ఈవో కేవీ గోపాలరావు, ఆలయ కమిటీ సభ్యుడు నూకల ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ నెల 26వ తేదీ మంగళవారం రాత్రి స్వామివారికి శ్రీ పుష్పయాగోత్సవం, పవళింపు సేవ జరుగుతాయన్నారు.

యువకుడిపై దాడి

అవనిగడ్డ: యువతి వెంటపడి వేధిస్తున్నాడనే కోపంతో రెండో వార్డుకు చెందిన ఆకుల శ్రీనివాస్‌పై ముగ్గురు యువకులు మారణాయుధాలతో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక యువతిని శ్రీనివాస్ కొంతకాలంగా వెంటపడి వేధిస్తున్నాడు. చెప్పినా వినకపోవడంతో యువతి సోదరులతో పాటు అతని స్నేహితులు కలసి శ్రీనివాస్‌పై మారణాయుధాలతో దాడిచేసి గాయపరిచారు. అతన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు. ప్రస్తుతం అతనికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎన్నికల రంగోలి



గూడూరు: హోలీ పర్వదినం పురస్కరించుకుని గూడూరు మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలు రంగు రంగుల రంగవల్లులతో ఆకట్టుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో సందేశాత్మక రంగవల్లులు వేసి ఓటర్లను ఆలోచింపజేశారు.